చెప్పాలని వు

చిదంబరానికి టాటా చెప్పేసి, ఉత్సాహంగా లల్లల్లా అని రాగం తీస్తూ, చెంచెంగున మెట్లమీద గెంతుతూ, చెదరిన ముంగురులూ, నలిగిన చీరా, కదిలిన భావాలూ, భర్త వచ్చేసరికి సరిచేసికోవటానికని డ్రాయింగ్ రూములోకి అడుగు పెట్టింది ప్రమీల. ఎదురుగా ఉన్న అద్దపు తలుపులలోనుండి అవతల ఉన్న బెడ్ రూమ్‌లో...ఏవో మధుర స్మృతుల్ని జ్ఞాపకం చేస్తున్నట్టుగా అడ్డదిడ్డంగావున్న దుప్పటీ, ఆ ప్రక్కనే బల్లమీద తినలేక పారేసిన ఆపిల్ ముక్కలూ తినకూడని బత్తాయి తొక్కలూ ..ఆరిపోయిన అగరొత్తుల మసీ.. కంటబడగానే అంతవరకూ తీస్తున్న రాగం ఆపేసి కొత్త పెళ్ళికూతురిలా సిగ్గు పడింది మళ్లా బెడ్‌రూమ్‌లోనికి వెళ్ళి అవన్నీ సర్దేసింది నిమిషంలో తిరిగి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి మరోసారి అద్దపు తలుపుల్లోంచి బెడ్‌రూమ్‌ని చూసి తృప్తిగా నవ్వుకుంది ప్రమీల. టాయ్‌లెట్ టేబిలు మీదున్న పుస్తకాల దొంతి చూసి టక్కున ఆగిపోయింది ప్రమీల నవ్వు.

ఆ పుస్తకా లక్కడికెలా వచ్చాయ్? సమాధానం చెప్పుకోడానికి ప్రమీల మనస్సు జంకింది.

చకచకా వెళ్ళి చూసింది. తను భర్తను తెమ్మన్న పుస్తకాలే! మీది పుస్తకంలోనుంచి తెల్ల కాగితం తొంగి చూస్తూ రెపరెపలాడింది ప్రమీల మనస్సులోని భయం లాగానే.

వణకుతూన్న చేతితో మెల్లగా తీసి చదివింది. మరేం లేదూ... 'నువ్వు అడిగిన పుస్తకాలు సంజీవరావుగారిచేత పంపిస్తున్నాను. నేను

రాపటం కొద్దిగా ఆలస్యం కావచ్చును—సత్యానందం' అని వుంది. కాని...కాని ఆ ప్రక్క మొదటి వాక్యం పిడుగుపాటులా తోచింది ప్రమీలకు. ఆ పిడుగుపాటుకు ఆపాదమస్తకమూ ఒక్కసారిగా లతలా వణికిపోయింది.

అంటే యిప్పుడు సంజీవరావుగారు వచ్చి వెళ్లారన్నమాట. డ్రాయింగ్ రూమ్‌లోనికి వచ్చి పుస్తకాలు పెట్టి...ఎదురుగా అద్దపు తలుపుల్లోంచి బెడ్ రూమ్... పచ్చినిజం అంత వగరుగావుంటే మరి మింగుడుపడక ఆలోచించలేకపోయింది ప్రమీల.

వెంటనే సత్తిగాడి మీద అపరిమిత కోపం వచ్చేసింది.

విసుగ్గా... ఆ కోపాన్నంతా... కిందినున్న హాలంతా గింగురుమన్నట్లుగా కాలింగ్ బెల్ మీద చూపింది. ఏం మునిగిపోయిందోనని సత్తిగాడు రెండేసి మెట్లకొక అంగ చొప్పున మీదికి పరిగెత్తాడు.

డ్రాయింగ్ రూమ్ గుమ్మం దగ్గరే చేతులు కట్టుకుని...అమ్మగారి చేతిలో నలిగిపోతున్న కాగితంవంక భయంభయంగా చూస్తూ... 'ఏటండమ్మగోరూ' అన్నాడు.

'నీకు ఏ పని చెప్పేను?' డ్రాయింగ్ రూమ్ అదిరిపోయినట్టుగా అడిగింది ప్రమీల. సమాధానం చెప్పలేక తలవంచుకుని నిలబడ్డాడు సత్తిగాడు.

'నే నిక్కడ మేడమీద మాట్లాడుతూంటే ఎవర్నీ మీదికి రానివ్వద్దన్నానా?—ఇప్పుడెవరొచ్చారు మీదికి—?' అంది ప్రమీల.

'సంజీవ రావుగారు..' మెల్లగా నోరు విప్పి చెప్పేడు సత్తిగాడు

'ఆయన మీది కొస్తుంటే మెట్లప్రక్కనే వుండి మిడిగుడ్లేసుకుని చూస్తూ కూర్చున్నావా? కళ్లు మూసుకుపోయాయా?'

నిజంగానే కళ్లు మూసుకు పడుకున్నాననీ, సంజీవరావుగారు పుస్తకాలు మేడమీద పెట్టారని అమ్మగారితో చెప్పమని చెప్పడానికి లేవేరనీ .. చెప్తే అమ్మగారే వంటారోనని నోరుమూసుకున్నాడు సత్తిగాడు. వాడు అలా నిశ్శబ్దంగా ఉండిపోవడంతో మరింత రెచ్చిపోయింది ప్రమీల.

'కళ్ళు మూసుకుపోయాయా అంటే నోరు మూసుకుంటావేంరా... ఇంతవరకూ చేసిన పని చాలుగాని... వెళ్ళి గుమస్తాగారి నడిగి నీ జీతం తీసుకుని ఫో ... మరి గుమ్మం తొక్కకు .. గెటౌట్...' అంటూ గట్టిగా పిచ్చిగా కేకేసింది ప్రమీల.

ఆ వెంటనే ఉధృతంగా వరదలా ఏడుపు ముంచుకొచ్చేయటంతో టేబిలుమీద తల వాల్చేసింది భోరుమంటూ.

ఇప్పుడెలా ? సంజీవరావుగారు చూసేరు. చూసింది చూసినట్టు ఆయనతో చెప్తారు. ఇంతవరకూ తాము ఆడిన నాటకం క్లైమాక్సు చేరుకుంది, ఇక ముగింపే... ఎలా వుంటుంది ? పుట్టింటికి పంపేస్తాడా తన భర్త ... అందరిలో అవమానిస్తాడా ? 'వద్దు భగవాన్ ... వద్దు' అంటూ మళ్లా భోరుమంది ప్రమీల.

'అమ్మగోరూ... అమ్మగోరూ...' అంటూ సత్తిగాడు పిలుస్తున్నాడు. ఎర్రగా ఉబ్బిన కళ్ళనెత్తి.., ఆతృతగా తనను చూస్తున్న సత్తిగాడిని ఏమిటన్నట్టుగా చూసింది... "ఏటండమ్మగోరు ఏడుస్తున్నారు... ఆ సీటీలో ఏటుంది...' అంటూ అడుగుతున్నాడు అంతవరకూ తిన్న తిట్లను మర్చిపోయి ... పూర్...ఫెలో... వీడినా తను గెటౌట్ అంది ? అనుకుంది ఒక గడియ ... అయినా ఇలాంటి విషయాలు ఏవని చెప్పుకుంటుంది ?...

'ఏంలేదుగానీ... నువ్వెళ్ళి కాఫీ పట్రా... అని పంపేసింది సత్తిగాడిని.

వాడైతే వెళ్ళిపోయాడుగానీ ... మనసులోంచి ఆలోచనలూ, ఆరాటం, ఆవేగం వెళ్ళనంటున్నాయి. వాడినన్నట్టు వీటినీ గెటౌట్ అనగలదా ? ... అంటే వెళ్ళిపోతాయా ?

ఆలోచించలేకుండా వుంది. కాని తప్పడంలేదు. ఈ లోకంలో దేన్ని తప్పుకుని అయినా దాగుడుమూత లాడచ్చు. కాని మనస్సుని తప్పించుకోలేమేమో ! బలవంతాన నిద్రపోదామా అంటే నిద్రరాదు... పోనీ - ఆయన పంపిన పుస్తకాలు చదువుదామా అంటే... అదొక ఆలోచనల పుట్ట... ముట్టుకుంటే ఆలోచనలు మరింతవచ్చి కుట్టేస్తాయ్. అన్నిటికీ మూలకారణం అదే .. ముట్టుకోకపోయినా అవి చుట్టుముట్టేస్తున్నాయ్...

తనెవ్వరినీ ఇష్టపడలేదు. ప్రేమించలేదు. పెళ్ళి... పెళ్ళి.. అని జీవితం, సుఖం అంతా అందులోనే వున్నట్టుగా చిన్నా పెద్దా అంతా ఊరికే బలవంతం చేసేరు 'నే పెళ్ళి చేసుకోను' అని ఖచ్చితంగా చెప్పినా. 'ఏం పెళ్ళి పోనిస్తూ' అని దాటేసినా, 'మీరు చేసుకుని ఎంత సుఖపడిపోతున్నారూ...' అని హేళన చెయ్యబోయినా ఏవీ లాభం లేదని తెలుసుకుని తల్లిదండ్రుల మాటమీద యాంత్రికంగా ఒప్పుకుంది పెళ్లికి. అప్పటికీ పెళ్ళి కొడుకుల్లో వంకపెట్టి తిరగ్గొట్టింది కూడా ... ఒప్పుకోక పోవటానికి సత్యానందంలో ఏ వంకా లేదు. ఒప్పుకుందన్న మాటేగాని ...పీటలమీద తన ప్రక్కన కూర్చున్న సత్యానందంని చూసి ఇతనితోనా తాను కాపురం చేయవలసింది అనిపించింది తనకు, అవును తప్పదు అని సమాధానం ఇచ్చింది మనసు. అలాగే మనసుమొట్టికాయ పెడితే బాధతో తల వంచుకూర్చుంది. అబ్బ! పెళ్లికూతురి కెంత సిగ్గో అన్నా రంతా. పొంగిపోయి తాళిగట్టేసాడు సత్యానందం.

లోకంలోని ఆఫీసర్లందరూ ఇలాగే కష్టపడిపోతున్నట్టు ... ఈయనగారెప్పుడు ఆఫీసు పనిలోనే ఉండేవారు. ఆ ఫైళ్లూ...గట్రా చుట్టూ ఉంటే ఆయనకి రంభ ఊర్వశీలమధ్య ఉన్నట్టుండేదేమో ! సత్తిగాడూ, గుమాస్తాగారూ, పని మనిషీ ఉన్నా బిక్కు బిక్కు మంటూ ఇద్దరే వున్నట్టుగా వుండేది. సత్యానందంతోనే భోజనం చేసేది తను. తరువాత ఆయన ఆఫీసుకూ, తను మేడమీదకూ. పనీ పాటా లేకుండా పడుకున్నంతసేపూ పడుకోవటమూ... తరవాత ఇల్లంతా కలయ తిరగటమూ.

బాగా చీకటిపడిం తర్వాత మెల్లగా ఇస్సురసి ఇల్లు చేరేవాడు సత్యానందం. ముట్టుకుంటే కస్సు మంటాడేమోనని అంటీ అంటనట్టు ప్రవర్తించేది తను - ఆయనగారి విసుగు చల్లారేసరికి తన వేడి చల్లారేది.

అప్పుడు మెల్లగా ప్రక్కకి చేరేవాడు.

'ప్రేమీ! సినిమాకు వెళ్దామా ?' అనేవాడు. కోపం మెల్లగా నసాళాని కెక్కేది తనకు. ఏదో పనిచేస్తున్నట్టుగా నటించేది మాట్లాడకుండా.

'కోపం వచ్చిందా ప్రేమీ ?'

కోపంకాదు ... ఒళ్లు మండిపోతోందని గట్టిగా అరవాలనిపించేది. కాని ... 'ఇప్పుడేం సినిమాకి వద్దు... చాలా అలసిపోయి వచ్చారు ... హాయిగా పడుకోండి.' అని చెప్పి లోపలకి వెళ్లిపోయేది.

'ఆహా ప్రేమీ ఎంత మంచిది...' అనుకునేవాడు సత్యానందం.

అంతే. మళ్లా ఉదయం లేవడం...ఆయినకి నీళ్లు తోడడం— వంటచేసి, భోజనం వడ్డించడం తన డ్యూటీగా తీసుకొని చకచక

చేసేది. అంతేగాకుండా పగలంతా పని ఉండేదీ కాదేమో...ఆ ఒక్క క్షణం పని తగలగానే చురుకుదనం వచ్చి చకచక చేసేది. మొగుడంటే ఎంత ఇదమ్మా ఈవిడకి అనుకునేవారు ఇంటికొచ్చే చుట్టాలూ పక్కాలూను. భోజనాలవరకూ ఊపిరిసలపనంత పని. తరువాత ఒక్కసారిగా తీరుబాటు. ఆ తీరిక దొరికేసరికి ప్రక్కనెవరూ ఉండరు. ఇన్నాళ్లగా జరుగుతున్న సంగతిది.

చిదంబరం మెల్లగా రంగంలోకి దిగాడు—

సత్తిగా డొచ్చేసరికి ఆలోచనలనుండి బయటపడిం దొక్కసారి 'అమ్మగోరూ! అయ్యగో రొచ్చేతలికి శానా ఆలీసెం అవుద్దట—ఫోనొచ్చింది—' అన్నాడు. టైము చూసుకునేసరికి ఆరు కావస్తోంది. సూర్యుడు కనుమరుగై పోయాడు—మీది కొస్తున్న చీకటి చేతుల్లోంచి తప్పుకొని సూర్యుణ్ణి ఆఖరిసారి చూద్దామా అన్నట్టుగా పక్షులు తపతప రెక్కలు కొట్టుకుంటున్నాయి; ప్రమీలనీ అలాగే ఆలోచనలు కప్పేస్తున్నాయి. చీకటిలాగా ముంచెత్తుతున్న భయంతో నెలవంక వెలుగులా తోచింది—ఆ నెలవంకను మబ్బులు మూసేసరికి మళ్లా మామూలే—భయం—చీకటి—ఆలోచనలు—

ఆ వేళ కూడా ఈ సత్తిగాడు ఇలాగే కబురు చెప్పాడు.

ఆ మర్నాడు ఆయన్ని అడిగితే తన స్నేహితు డొకడు పారిస్ నుండి తిరిగొచ్చాడనీ—రిసీవ్ చేసుకుందికి వెళ్లాననీ చెప్పాడు సత్యానందం.

ఆ ఫ్రెండే చిదంబరం!

తరువాత ఇంట్లో పార్టీ ఇప్పించాడు సత్యానందం. ఏ ముహూర్తాన చిదంబరం వచ్చాడోగాని—అప్పటినుండీ ప్రమీల ప్రమీలకాదు

మొదటిసారి చూసినపుడే ఏదో భావం కలిగింది తనకు. ఆ వెంటనే తనను తాను సంబాళించుకుంది. తాను వివాహమైన స్త్రీ. పైగా గౌరవంగా బ్రతుకుతున్న కుటుంబానికి చెందినది అలాంటి భావం కలిగినందుకు తనను తానే అసహ్యాయించుకొంది ప్రమీల.

కాని చిదంబరంముందు తనమీద అసహ్యమూ, తన గౌరవమైన కుటుంబం మీద కాంతు, వివాహమైందనే భయం - అన్నీ మర్చిపోయింది ప్రమీల. అతనితో మాట్లాడినపుడే మొట్టమొదటి సారిగా అందమంటే ఏమిటో కొద్దికొద్దిగా తెలుస్తూ వచ్చింది. అప్పుడే నిజానికి తన మనసు వికసించ నారంభించిందేమో !

చిదంబరం మాట్లాడుతూన్నకొద్ది వినాలలనిపించేంత చక్కగా మాట్లాడుతాడు. అలా మాటలతోనే కొత్తవాళ్ళ దగ్గరా—వాళ్ళూహించనంత చనువు తీసుకుంటాడు. అలాగే తన దగ్గరా చనువుతోపాటు మనసూ తీసుకున్నాడు. అతను లేనిదే తనకి మనువులేదనిపించేట్టు చేసాడు. ఇప్పుడు తను సత్యానందం చాటునున్న చిదంబరం తాలూకు మనిషి.

ఇన్నాళ్ళూ ఎవరికి తెలియలేదీ వ్యవహారం.

కాని—కాని ఇప్పుడు సంజీవరావుగారు చూసేసారు. కళ్ళారా చూసారు. చూసిందంతా చెప్తారు. ఎలా...? ఎలా...? చుట్టూ భయం నిద్రమత్తులా చిక్కబడుతోంది, చెమటలు పట్టాయి ... ఆ భయంలో ... ఆ చెమటలో ... ఎప్పుడో ఎలాగో నిద్ర పట్టింది ప్రమీలకు.

లేచేసరికి మనసు కొంచెం తేలికయింది. పనుల్లో మునిగింది. సత్యానందం లేచినట్టు అన్పిస్తే... ఛ ... ఇంత మొద్దు నిద్రపోయానేమిటి అని సిగ్గు పడుతూ అతని గదిలోనికి తొంగి చూసింది ప్రమీల. ఎన్ని గంటలకు లేచాడోగాని సత్యానందం పక్కమీదనే మఠం వేసు

కూర్చున్నాడు. అలా శూన్యంలోకి చూస్తూ ప్రియమైనదేదో పోయినట్టు సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. అతన్నలా చూచేసరికి... ప్రమీలకి మర్చిపోయిన భయం ఒక్కసారిగా ఎగదన్నింది.

ప్రమీలను చూడటంతో మెల్లగా లేచి ఏమీ మాట్లాడకుండా బాత్‌రూమ్‌లోనికి నడిచాడు సత్యానందం. మళ్లా ముభావంగానే వచ్చి ఈజీఛైరులో కూర్చున్నాడు సత్యానందం. దోషిలా తల వంచుకుని కాఫీ ఇచ్చింది ప్రమీల. ఏమైనా అంటాడేమోనని ఎదురు చూసింది. మౌనంగా తీసుకుని కాఫీ త్రాగేసి ... కప్పు క్రిందని పెట్టేసాడు సత్యానందం.

ఏమీ మాట్లాడడేం ? తొందరగా ఏదో తిట్టేస్తే తనకి భయం భారం ఉండవు. పోనీ తనే చెప్పేస్తే ... చెప్పగలదా ? — చెప్పి ?— విడాకులు తీసుకోవాలా ? ... ప్చ్ ... తను చెప్పలేదు ... చెప్పదు... చెప్పాలనే ఉన్నా ..

ఇద్దరి మనసులూ భారంగా ఉన్నాయ్.

ఆఫీసు టైమైనా కుర్చీలోనుండి లేవలేదు సత్యానందం. 'ఆఫీసుకు వెళ్ళరా' అని అడుగుదామని వచ్చి ... తిరిగి వెళ్ళిపోయింది... వంటాగింటా పూర్తి చేసుకుని భోజనానికి పిలవమని సత్తిగాణ్ణి పంపింది. భోజనం చెయ్యరుట అని కబురు తెచ్చాడు సత్తిగాడు.

ఒక్కసారిగా కోపం వచ్చింది ప్రమీలకు. సంజీవరావుగారు చెప్పిందేదో తనని అడిగేస్తే—తను ఏదో జవాబిస్తుంది కదా— తను ఏదో చేసిందని ఆ పవిత్రత అంతా భోజనంలో కలవదు కదా— చెయ్యకపోవటానికి. ఉపవాసాలు చేస్తే పవిత్రులమైపోతామా ? చరచరా సత్యానందం దగ్గరకు వెళ్లింది.

'భోజనం చెయ్యనన్నారుట.'

'అవును.'

'ఎంచేతనో?'

'ఏమీలేదు'

'ఉదయంనుండి చూస్తున్నాను మీ వాలకం... కడుపులో ఉన్న దేదో చెప్పెయ్యరాదూ... మీలో మీరెందుకలా అయిపోతారూ...' అంతవరకూ ఏదో ఆవేశంలో అనేసింది... వెంటనే ఆవేశం జారి పోగానే వణుకు ప్రారంభం అయింది ప్రమీలకు.

'ఏమీ లేదు ప్రేమీ... నిన్న పుస్తకాలు తెచ్చారు జ్ఞాపకముందా —సంజీవరావుగారని...'

'ఆఁ' పాలిపోయిన ముఖంతో అంది ప్రమీల.

'నీకు పుస్తకాలిచ్చిన తర్వాత ఆఫీసుకు నాలుగైదుసార్లు ఫోను వచ్చింది...'

'ఏమని?' కత్తిపోటుకు నెత్తురు చుక్కలేదు ప్రమీలకు. పేల బోతోన్న టపాకాయ చప్పుడుకు సిద్ధంగా ఉంది.

'నాతో ఏదో చెప్పాలని వుందంటూ... తీరికలేక వెళ్ళలేక పోయాను. తీరా సాయంత్రం వెళ్ళేసరికి ..పాపం ... ఆయన హార్టు ఫేలయి చనిపోయారట అంతకు గంట క్రితమే... ఏవిటో ప్రేమీ— ప్రాణం ఎప్పుడు గుటుక్కుమంటుందో తెలీదు కదా. చెప్పాల్సింది చెప్పకుండానే పోయారు—''

(ఆంధ్ర పత్రిక)